రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులతో చర్చిస్తా: సీఎం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదివారం సాయంత్రం మూడు రోజుల హస్తిన పర్యటనకు వెళ్లారు. దీనికి ముందుగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరగనున్న మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సదస్సు కీలకమైందన్నారు. తన పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి చర్చిస్తానన్నారు.

పారిశుద్ధ్యం పనుల్లో ధర్మేంద్ర



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం ఉదయం భువనేశ్వర్‌లోని చంద్రశేఖర్‌పూర్ మంగళా బస్తీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధులు ఊడ్చి శుభ్రపరిచారు. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

హేమగిరి అడవిలో నల్లపులి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా హేమగిరి అడవిలో నల్లపులి (బ్లాక్ పాంథర్) కనిపించింది. అరుదైన ఈ జాతి పులి అటవీశాఖ అమర్చిన కెమెరాకు చిక్కినట్లు వన్యప్రాణి అధికారి(డీఎఫ్‌ఓ) ప్రదీప్ మిరాసె ఆదివారం విలేకర్లకు చెప్పారు. దీనిపై శాఖ నిఘా ఉంచిందన్నారు.

రాయగడ సిల్వికల్చర్ డీఎఫ్‌ఓ సస్పెన్షన్

సంజయ్‌నాయక్ ఆత్మహత్య కేసులో చర్యలు



దేబేంద్రకుమార్ బెహరా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ సిల్వికల్చర్ డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) దేబేంద్రకుమార్ బెహరా సస్పెండయ్యారు. కలహండి జిల్లాలో అటవీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సంజయ్‌నాయక్(35) ఆత్మహత్యలో అటవీశాఖ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్ ప్రధాన కార్యాలయం (భువనేశ్వర్)లో హాజరుకావాలని, సస్పెన్షన్ సమయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ వదలి ఎక్కడికీ బెహరా వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులకు చేసిన ఫిర్యాదులో దేబేంద్రబెహరా ఒత్తిడితో సంజయ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించడం సంచలనం సృష్టించింది. విడతల వారీగా రూ.7 లక్షల వరకు లంచం తీసుకున్న దేబేంద్ర మరింత నగదు, ఇతర అవసరాలు తీర్చాల్సిందిగా ఒత్తిడి చేయడంతో సంజయ్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యేవారని భార్య ప్రియాంక అధికారులకు, మీడియాకు తెలిపారు. దీంతోపాటు రాయగడ పర్యటనకు వచ్చిన అటవీశాఖ మంత్రి గణేష్‌రాంసింగ్ ఖుంటియాకు ఈ విషయమై వినతిపత్రాన్ని అందజేశారు.

లేఖ ఆధారంగా విచారణ



సంజయ్‌నాయక్ (పాతచిత్రం)

సంజయ్ ఆత్మహత్య చేసుకున్న ఘటనా స్థలంలో లభించిన లేఖ ఆధారంగా కలహండి జిల్లా భవానీపట్న పోలీసులు విచారణ కొనసాగించినట్లు సమాచారం. దీనిపై విచారణకు పోలీసుస్టేషన్‌కు రావాల్సిందిగా కోరినా బెహరా తప్పించుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం న్యాయస్థానం నుంచి అరెస్టు కాకుండా ముందస్తు అనుమతిని పొందాక పోలీసుల ముందు ఆయన హాజరు కావడం గమనార్హం. బెహరాతోపాటు రాయగడ ఏరియా రేంజర్ ప్రకాష్‌రథ్, భువనేశ్వర్ ఏసీఎఫ్ రజనీకాంత్ రౌత్‌లను భవానీపట్న ఎస్డీపీఓ సునారాం హేంబ్రం విచారించినట్లు పోలీసువర్గాలు తెలిపాయి.

ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో జ్ఞానజ్యోతులు వెలిగించే ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి కోరారు. శనివారం రాత్రి భువనేశ్వర్ కళింగ స్టేడియం వేదికగా 16 వేల 9 మంది ఉపాధ్యాయులకు ఆయన నియామకపత్రాలు (జాయినింగ్ ఆర్డర్లు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాలబాలికలకు ఉత్తమ భవిత అందించేవారు కావాలన్నారు. తమ ప్రభుత్వం ప్రాథమిక విద్యకు ప్రాధాన్యమిస్తోందని, అందుకు అనుగుణంగా ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు పెంచిందని చెప్పారు. పాఠశాలలు మానేస్తున్నవారి సంఖ్య తగ్గించడం ధ్యేయమని, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. గత ప్రభుత్వం 5టీ పేరిట పాఠశాల భవనాలకు రంగులు, సున్నాలు వేయించి ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. కేంద్రం అమలు చేసిన నూతన విద్యా విధానాన్ని పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలకు పెద్దపీట వేసినందున ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారంతా రేపటి ఉన్నత సమాజ నిర్మాతలన్నారు. నూతన విద్యావిధానంలో కేంద్రం మాతృభాష బోధనకు ప్రాధాన్యమిచ్చిందని, ఇప్పటి విద్యాలయాలను నాటి గురుకులాలుగా మార్చాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజ, ప్రాథమిక విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శాలిని పండిత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



నియామకపత్రాలు అందజేస్తున్న మోహన్‌చరణ్. పక్కన ధర్మేంద్ర, నిత్యానంద, ఇతర అధికారులు

కార్మికుల సంక్షేమానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సుమిత మహాపాత్ర్. పక్కన భవానీశంకర్‌దాస్ తదితరులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలో మంగళవీధి ప్రాంతంలోని సంగీత పాఠశాల భవనంలో ఆదివారం భారతీయ మజ్దూర్ సంఘం నూతన వర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమిత మహాపాత్రో, సాధారణ కార్యదర్శి పృథ్వీరాజ్ పండా, రాష్ట్ర సభ్యుడు భవానీశంకర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. మహాపాత్రో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం భారతీయ మజ్దూర్ సంఘ పాటుపడుతుందన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుజిత్ ప్రధాన్, కార్యదర్శి అంచలి నాయక్, ఉపాధ్యక్షుడు శంకర్‌చరణ్‌గౌడ్, కైలాస్‌సాహులతోపాటు పలువురిని నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు.

రైతులకు మేలురకం ఆలూ విత్తనాలు

స్వయం సమృద్ధి ధ్యేయమన్న సింగ్‌దేవ్



భువనేశ్వర్, న్యూస్‌టుడే

గతంలో నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆలూ మిషన్ ప్రారంభించింది. 2015 నుంచి ఇది అమలైంది. మూడేళ్లు ఈ పంట వేసిన అన్నదాతలు వరుస నష్టాలు ఎదుర్కొన్నారు. చేతులు కాల్చుకున్న వారంతా తర్వాత ఈ పంట సాగు మానుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం ఆలూ మిషన్ కింద ఖర్చు చేసిన రూ.800 కోట్లు వృథా అయ్యాయి.

శీతల గిడ్డంగులు ఏర్పాటు



ప్రస్తుత భాజపా సర్కారు మళ్లీ రైతులకు ఆలూ పంట సాగు కోసం అవగాహన కల్పిస్తోంది. అండగా ఉంటామని హామీ ఇస్తోంది. వ్యవసాయ శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ శనివారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నవంబరు మొదటి వారంలోగా రైతులకు మేలిమి రకం ఆలూ విత్తనాల కిట్లు ఉచితంగా అందిస్తామన్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి విత్తనాలు దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ వ్యవధిలోగా రాష్ట్రంలోని 57 సబ్‌డివిజన్ కేంద్రాల్లో పీపీపీ మోడ్ (ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు)లో హైబ్రిడ్ శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానించామని, పలువురు ముందుకొచ్చారన్నారు.

పొరుగు రాష్ట్రంపైనే ఆధారం

ఆలూ లేనిదే రాష్ట్ర ప్రజలకు ముద్ద దిగదు. కూరల్లో దీనిని తప్పనిసరిగా వినియోగిస్తారు. పంట ఉత్పత్తి ఇక్కడ అంతంతమాత్రంగా ఉండడంతో పొరుగు రాష్ట్రం పశ్చిమబెంగాల్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయి. రెట్టింపు ధరలకు అమ్మకాలు జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న గత ప్రభుత్వం ఆలూ మిషన్ ప్రారంభించినా లక్ష్యం నెరవేరలేదు. రైతులకు కేటాయించిన విత్తనాలు చాలా చోట్ల మొలకెత్తలేదు. కొన్నిచోట్ల ఉత్పత్తి బాగానే వచ్చినా శీతల గిడ్డంగులు లేకపోవడంతో నిల్వ చేయలేక నష్టపోయారు.

అధికోత్పత్తి సాధిస్తాం

గత ప్రభుత్వం జనవరి నెలలో రైతులకు విత్తనాలు కేటాయించడం వల్ల ఆలస్యంగా పంట వేసినవారు నష్టాలు చవిచూశారని సింగ్‌దేవ్ చెప్పారు. ఆలూ పంటకు అనుకూలమైన సమయం నవంబరు, డిసెంబరు నెలలని, ఈ ఏడాదిలో అన్ని జిల్లాల రైతులకు విత్తనాలు అందిస్తామన్నారు. ఈ దిశగా వ్యవసాయశాఖ యంత్రాంగం అన్నదాతలకు సహాయం అందిస్తుందన్నారు. అధికోత్పత్తులు సాధిస్తామన్న నమ్మకం ఉందని సింగ్‌దేవ్ చెప్పారు.

బొమ్మలో.. అమ్మను చూసుకుంటూ..



కిరణమాలా నాయక్ బొమ్మతో భర్త ప్రశాంత కుమార్ నాయక్, కుమార్తె మెహక్, కుమారుడు అయాన్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని ఓ ఇంట్లో సోఫాలో జీవం ఉట్టిపడేలా కనిపిస్తున్న ఆ ఇంటి ఇల్లాలు కిరణమాలా నాయక్ సిలికాన్ బొమ్మ నగరంలో చర్చనీయాశంగా మారింది. పాత బ్రహ్మపుర ప్రాంతంలోని జగబంధు వీధికి చెందిన వ్యాపారి ప్రశాంత్ కుమార్ నాయక్ (మున్నా) భార్య కిరణమాలా హఠాత్తుగా అస్వస్థతకు గురై 2021 ఏప్రిల్ 25న కన్నుమూసింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నారు. పెద్ద కుమార్తె మేఘనా నాయక్‌కు పెళ్లయింది. రెండో కుమార్తె మెహక్ నాయక్ బ్రహ్మపుర సమీపాన ఓ ప్రైవేటు వర్సిటీలో ఎంబీఏ చదువుతోంది. కుమారుడు అయాన్ నాయక్ ఐదో తరగతి చదువుతున్నాడు. కిరణమాలా లేని లోటును భర్త, బిడ్డలు భరించలేకపోయారు. దీంతో ఆమె ఆకృతిని తయారు చేయిద్దామని కుమార్తెలు తండ్రి ప్రశాంత్‌కు తెలిపారు. ఇందుకు ఆయన అంగీకరించడంతో వారు బెంగళూరులోని ప్రముఖ కళాకారుడు శ్రీధర్ మూర్తి కె.తో సంప్రదించారు. కిరణబాలా చిత్రాలను ఆయనకు అందజేశారు. ఆయన ఫైబర్, సిలికాన్, రబ్బర్‌తో కిరణబాలా కూర్చున్నట్లుగా ఎత్తయిన ఆకృతిని తయారు చేశాడు. ఇందుకోసం ఆ కుటుంబం సుమారు రూ.8 లక్షలు వెచ్చించింది. గతేడాది ఆమె బొమ్మను బ్రహ్మపురలోని ఇంట్లో డ్రాయింగ్ గదిలోని సోఫాలో ఉంచారు. ‘అమ్మ లేని లోటును పూడ్చలేము. భౌతికంగా ఆమె మా మధ్య లేకపోయినా బొమ్మ రూపంలో ఎప్పుడూ మాతోనే ఉంది’ అని గద్గద స్వరంతో ఆమె రెండో కుమార్తె మెహక్, కుమారుడు అయాన్ ఆదివారం ‘న్యూస్‌టుడే’కు చెప్పారు. ప్రతిరోజు ఆమె దుస్తులు మార్చడం, ఆభరణాలతో అలంకరించడం వంటివి చేస్తుంటానని కుమార్తె మెహక్ పేర్కొంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ అంతా అమ్మే చూసుకునేదని గుర్తు చేసుకుంది. ఇంట్లో ఆమె బొమ్మను చూస్తున్న ప్రతీసారీ అమ్మ తమతోనే ఉందన్న భావన కలుగుతోందని మెహక్ తెలిపింది. ఇల్లంతా ఆమె నడిపించేదని భర్త ప్రశాంత్ పేర్కొన్నారు. ఆమె లేని లోటు తీర్చలేనిదైనా బొమ్మ రూపంలో ఆమె కనిపించడంతో ఆమె స్మృతులు మదిలో మెదులుతుంటాయని ఆయన తెలిపారు.

పశ్చిమ, దక్షిణ ప్రాంత బస్సు ఆపరేటర్ల సమ్మె

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పశ్చిమ, దక్షిణ జిల్లాల ప్రైవేటు బస్సు ఆపరేటర్లు సోమవారం సాయంత్రం 6 నుంచి 24 గంటల సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం లక్ష్మీ బస్సుల విషయంలో మాట తప్పినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు భవానీపాట్నా(కలహండి జిల్లా) ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ప్రభోద్‌రథ్ ఆదివారం విలేకర్లకు చెప్పారు. లక్ష్మీ బస్సులు పంచాయతీల నుంచి సమితి కేంద్రాల వరకే రాకపోకలు సాగిస్తాయని, జిల్లా కేంద్రాల్లో తిరగబోవని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇటీవల ఈ బస్సులు జిల్లా కేంద్రాలకు రాకపోకలు సాగిస్తున్నందున తాము నష్టాలు చవి చూస్తున్నామన్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియపరిచినా పట్టించుకోనందున ప్రైవేటు బస్సు సంఘాలన్నీ నిరసనగా ‘చక్కాబంద్’కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమ్మెలో ఉత్తరకోస్తా, తీర జిల్లాల ప్రైవేటు ఆపరేటర్లు పాల్గొంటారా? లేదా? అన్నదానిపై స్పష్టత లేదు.

దసరా వచ్చింది.. పనులు పూర్తిచేయరా?



పాతబ్రహ్మపుర నుంచి అందపసర రహదారి దుస్థితి

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలోని వివిధ వార్డుల్లో రహదారులు, కాలువల నిర్మాణం పనులు అసంతృప్తిగా ఉన్నాయని పలువురు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు గతకలుగా మారి, రాళ్లపైకిదేరి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న సంగతి తెలిసిందే. దసరా పండుగలోపు ఆయా పనులు పూర్తి చేయాలని గత నెల ఆఖరి వారంలో బీఈఎంసీ మండలి సమావేశంలో మేయరు సంఘమిత్ర దొళాయి, పలువురు కార్పొరేటర్లు ఈఈలు, జేఈలకు సూచించినపుడు వారం రోజుల్లో ఆయా పనులు పూర్తి చేస్తామని వారు చెప్పారు. దసరా పూజలు ప్రారంభమై నాలుగు రోజులు కావస్తున్నా ఇప్పటికీ పలు ప్రధాన రహదారుల్లో మరమ్మతు పనులు జరగలేదు. దసరా పూజలు చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో నగరానికి వస్తుంటారు. మరో వారం రోజుల్లో ఈ పండుగ అయిపోతుంది. ఇంకెప్పుడు పనులు చేస్తారోనని పలువురు పెదవి విరుస్తున్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంతో చౌడేశ్వరి దేవి

బ్రహ్మపురలో మార్వాపేటలోని రామలింగ చౌడేశ్వరి దేవి దేవస్థానంలో అమ్మవారిని ఆదివారం అన్నపూర్ణా దేవి అవతారంలో అలంకరించి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఇదే ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక దీపాలంకరణలు చేశారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



పంచామృతాభిషేకాలు.. సామూహిక పూజలు



గాయత్రీ మాత మందిరం ఆవరణలో శ్రీచక్ర యంత్రరాజం, ఉత్సవ మూర్తులకు భక్తుల అభిషేకాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాలు బ్రహ్మపురలోని మందిరాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని వేదమాత గాయత్రీ దేవి మందిరం ఆవరణలోని వేద భవనంలో శ్రీచక్ర యంత్రరాజం, గణపతి, గాయత్రీ ఉత్సవ మూర్తులకు భక్తులు పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం ఇదే ఆవరణలో మహిళల సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఖస్పావీధిలోని జటాధరేశ్వరస్వామి ఫంక్షన్ హాల్లో ఉదయం కుంకుమతో లలితా సహస్ర నామార్చన, వివిధ రకాల పూలతో లలితా త్రిపురసుందరి దేవి అష్టోత్తర నామార్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో దంపతులు, మహిళలు పాల్గొని ఆయా పూజలు నిర్వహించారు. వీటితోపాటు నగరంలోని ఇతర మందిరాలు, సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

శ్రీక్షేత్రంలో మహావేడుక

పూరీ శ్రీక్షేత్రంలో దుర్గామాధవుల గోప్య గుండిచా వేడుకలు కొనసాగుతున్నాయి. సేవాయత్‌లు నిత్యం ఉత్సవ విగ్రహాలను డోలా మండపం వీధిలోని నారాయణి ఆలయానికి తీసుకెళ్లి పూజలు చేయిస్తున్నారు. సెలవులు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది.

అమ్మలకు మడపళ్లు

గ్రామాల్లో సందడి



గోపాలపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. సర్వత్రా ఉత్సవ వాతావరణం, శక్తిపీఠాలు, దేవీ పెండాళ్లలో చండీ స్తోత్ర పారాయణాలు మార్మోగుతున్నాయి. గ్రామదేవతలకు రైతులు మడపళ్లు సమర్పిస్తూ చల్లగా చూడాలని ప్రార్థనలు చేస్తున్నారు. పంటలు పచ్చగా ఉన్నందున అందరిలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆదివారం కటక్ చండీమాత ఆదిపరాశక్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

పర్యాటకాభివృద్ధికి పడని అడుగు... ఎందుకో అడుగు?

కొరాపుట్ జిల్లాలో గుహలపై నిర్లక్ష్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే

రాష్ట్రంలో పర్యాటకంగా కొరాపుట్ జిల్లాకు మంచి గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కువగా గుహలున్నాయి. రెండేళ్ల క్రితం వీటికి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. అభివృద్ధి మాత్రం కాగితాలకే పరిమితమైంది. నందపూర్ సమితి బాల్దా సమీపంలోని నాగేశ్వర్ గుహ, రాజా గుహలతోపాటు జయపురం సబ్‌డివిజన్ పరిధిలోని గుప్తేశ్వరం వంటి చారిత్రక గుహలు కొత్తగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా గుర్తింపునకు కృషి చేస్తున్నామని అప్పటి జిల్లా పాలనాధికారి మొహమ్మద్ అబ్దుల్ అక్తర్ రెండేళ్ల క్రితం ప్రకటించారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు.



గుప్తేశ్వరంలో గుహల్లో వెలిసిన శివ లింగం



బాల్దాలో గుహకు వెళ్లే మార్గం

జిల్లాలోని పొట్టంగి సమితిలో పెద్దపాడు, నందపూర్ సమితిలో బాల్దా, పరియామాలి, జయపురం ప్రాంతంలో గుప్తేశ్వరం, లక్ష్మీపూర్ సమితిలో కుటునిపొదొరో, కొరాపుట్ సమితిలో ఖజురిపుట్, సిమిలిగుడ సమితిలో మాలి పర్వతం వంటి గుహలు అనేకం ఉన్నాయి. వీటిల్లో ఉండే దేవతామూర్తులకు గిరిజనులు వివిధ సందర్భాల్లో పూజలు చేస్తున్నారు. ఏడాదిలో ఒకటి రెండుసార్లు యాత్రలు కూడా జరుగుతాయి. భారీ ఎత్తున గిరిజనులు పాల్గొంటారు. పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలకు ఆనుకుని ఉన్న పర్వతాలపై బాక్సైట్ తవ్వకాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదే జరిగితే ఆ పర్యాటక ప్రాంతాలు ఆకర్షణ, ఆదరణ కోల్పోతాయి. ఇలాంటి ప్రకృతి సంపద పాడవకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు ఏళ్లుగా డిమాండ్ చేస్తుండగా, రెండేళ్ల క్రితం ప్రభుత్వం స్పందించింది. నాగేశ్వర్, రాజ గుహలకు వెళ్లేందుకు రహదారి, విద్యుత్తు సౌకర్యం సమకూర్చాల్సి ఉండగా, పనులు కార్యరూపం దాల్చలేదు. అప్పటి కలెక్టర్ బదిలీ కావడంతో కొత్త కలెక్టర్ దీనిపై దృష్టి సారించలేదు. ప్రజాప్రతినిధులు సైతం మారిపోవడంతో గుహల అభివృద్ధి ముందుకు సాగడం లేదు. జిల్లాలో ఉండే ఇలాంటి కేంద్రాలుగా అభివృద్ధి చెందితే స్థానికులకు లబ్ధి చేకూరుతుందని పలువురు ఆశాభావంతో ఉన్నారు. పొరుగునున్న ఆంధ్రాలోని బొర్రా గుహలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది. లోపలికి వెళ్లేందుకు మెట్లు, విద్యుత్తు సౌకర్యం, మంచినీరు సమకూర్చింది. ఒడిశాలోని ఇలాంటి సుందర ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవడంపై పలువురు ఈ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్ వద్ద ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా పర్యాటక శాఖ అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.



ఆంధ్రాలో బొర్రా గుహలు



మాలి పర్వతం గుహలో చైత్రపండగలో పాల్గొన్న గిరిజనులు


కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి తదితరులు

వైద్య కళాశాల పనితీరుపై సమావేశం

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో లక్ష్మణ్‌నాయక్ వైద్య కళాశాల సభామందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి మాట్లాడుతూ కొరాపుట్ వైద్య కళాశాలకు నాలుగు జిల్లాల నుంచి ప్రజలు వస్తుంటారని, వైద్య సేవలు అందక పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారన్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పాలనాధికారి కీర్తివాసన్ అన్నారు. లక్ష్మీపురం ఎమ్మెల్యే పవిత్ర సౌంధ, పాలనాధికారి వి.కీర్తి వాసన్, వైద్య కళాశాల సూపరింటెండెంట్ సుభాష్‌సాహు, జడ్పీఛైర్మన్ సస్మిత మెలకలు ఉన్నారు.

అడవులను సంరక్షించాలి

గుణుపురం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో అడవులను సంరక్షించాలని గుణుపురం రేంజరు గంగాధర మిశ్రా అన్నారు. పద్మపురం అటవీ పరిధిలో పుల్‌పుటిలో విశ్వ వన్య ప్రాణుల వారోత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జుంపాపుర్, మలాపదర్, కొయిరా, అంబాబడి, పిండాపదర్ తదితర గ్రామాల స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు రేంజరు బహుమతులు అందజేశారు.


ముగ్గులను పరిశీలిస్తున్న గుణుపురం రేంజరు గంగాధర మిశ్రా ఇతర అటవీ అధికారులు


డీఐజీకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సస్మిత తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలు క్షీణించకుండా దృష్టిసారించాలని ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఐజి నీతిశేఖర్, ఎస్పీ రోహిత్ వర్మలను శనివారం రాత్రి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత కోరారు. కొంతమంది జిల్లా పరిషత్ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రాఫిక్ సమస్య, శాంతిభద్రతలతో పాటు ప్రజాప్రతినిధులకు రక్షణ తదితరాలపై చర్చించారు.

'అమ్మ పేరుతో మొక్క'

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఐడీబీఐ 60వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించింది. సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్త సహకారంతో పితామహల్ క్యాంపస్ ఆవరణలో మొక్కలు నాటారు. బ్యాంకు రాయగడ శాఖ మేనేజర్ నిహార్‌రంజన్ సాహు మాట్లాడుతూ ఐడీబీఐ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, పర్యావరణానికి దోహదపడే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు.


మొక్క నాటుతున్న నిహార్‌రంజన్ తదితరులు


నృత్యాలు చేస్తున్న మహిళలు

దాండియా నృత్యాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బ్రహ్మపురలోని వివిధ సంస్థలు, వ్యక్తుల ఆధ్వర్యంలో దాండియా నృత్యాలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి హిల్‌పట్నాలోని బిజు పట్నాయక్ సాంస్కృతిక భవనంలో అమిత్ దాస్ నాయకత్వంలో దాండియా నృత్యాలతో ప్రజలు సందడి చేశారు. ప్రముఖ గాయకుడు జేమ్స్ బృందం హుషారెక్కించే పాటలతో ఉర్రూతలూగించింది.

కరుణించమ్మా...దుర్గమ్మ


గుణుపురం గ్రామదేవత పాలపోలమ్మ అమ్మవారిని అందంగా అలంకరణ

పట్టణాల్లో దేవి నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రోజూ వేకువజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేస్తున్నారు. ఖరగ్‌పూర్‌లో అమ్మవారిని రవికలతో అలంకరించారు. గుణుపురంలో గ్రామదేవత పాలపోలమ్మను భక్తులు దర్శించుకున్నారు.

–న్యూస్‌టుడే, బృందం


ఖరగ్‌పూర్‌లో రవికెల రూపంలో..


జయపురం కొట్పాడలో త్రిపుర సుందరిగా ..


పర్లాఖెముండిలో బాలసాధన పాఠశాలలో కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు


సిమిలిగుడ: తరణి మందరింలో జరిగిన పూజా కార్యక్రమంలో రాజేంద్ర దంపతులు

తెలుగు ఇళ్లలో 'బొమ్మల కొలువు'

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల్లో పలు తెలుగు కుటుంబాలు తమ ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తుంటారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం ప్రస్తుతం కరవైంది. పట్టణంలో పలు ఇళ్లలో నేటికి కొన్ని కుటుంబాలు కొనసాగిస్తున్నాయి. పట్టణ శివారు ప్రాంతమైన ఫారెస్టు కూడలి వద్ద నివాసముంటున్న విశ్రాంత అటవీశాఖాధికారి త్రిపురాణా సంజీవ బాబు, గిరిజా పద్మజ దంపతులు గత 45 ఏళ్లుగా ఈ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. దేవి నవరాత్రుల సందర్భంగా వివిధ రూపల్లో సుమారు 200 వరకు బొమ్మలను అలంకరించామని భార్యభర్తలు న్యూస్‌టుడేకి చెప్పారు.


బొమ్మల వద్ద పూజలు చేస్తున్న త్రిపురాణ గిరిజా పద్మజ

పురపాలికలో లోపించిన పారిశుద్ధ్యం

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ పురపాలక పరిధిలో జ్వరాలు ప్రబలుతుండడంతో ఛైర్మన్ లలితరంజన్ సెరి స్వయంగా పారిశుద్ధ్య సిబ్బందితో పనులు చేయించారు. డ్రైనేజీలు శుభ్రపరచడం, నిలిచి ఉన్న నీటిని తొలగించి దోమలు లేకుండా రసాయనాలు చల్లారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.


తొలగిస్తున్న వ్యర్థాలు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పురాధ్యక్షుడు

ప్రైవేటు బస్సులు బంద్

జయపురం, న్యూస్‌టుడే: దక్షిణ పశ్చిమ ఒడిశాలో లక్ష్మీ బస్సులు నడపటంతో ప్రైవేటు బస్సు యజమానులు భారీగా నష్టపోతున్నామని, వెంటనే వాటి సేవలు నిలిపివేయాలని జయపురం మీడియా సమావేశంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు నరేంద్ర మహంతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 వరకు ప్రైవేటు బస్సులు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నల్ల రిబ్బన్లతో నిరసన

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో జిల్లాస్థాయి ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీ నల్ల రిబ్బన్లు ధరించి బ్లాక్‌డేగా పాటించింది. విద్యాశాఖ కార్యాలయం గేటు ఎదుట నల్ల జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. కమిటీ అధ్యక్షుడు అర్జున్‌బొత్ర, మున్నాత్రిపాఠి పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న సభ్యులు

ఆట పాటలతో సురభి ఉత్సవాలు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా గుడారి, రామన్నగుడలో రెండు రోజుల పాటు జరిగిన సమితి స్థాయి సురభి శిశు మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గుడారిలో బీడీవో అనీషా దాస్, ఐపీసీ సమర్పితా స్వయి, ఇతర అధికారులు, పాల్గొన్నారు. రామన్నగుడలో సమితి అధ్యక్షుడు రవిగమాంగ్, బీడీవో ప్రద్యుమ్న తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, పాటలు, నృత్యాలు, క్రీడలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


రామన్నగుడ కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ శిక్షణ శిబిరం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితిలో ఆదివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం జరిగింది. సమితి వ్యవసాయ శాఖాధికారి అయాన్‌కుమార్ బిసోయి సేద్యంలో మెలకువలు తెలియజేశారు. దాదాపు 115 మంది మహిళలు, 90 మంది పురుషులు శిబిరంలో పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళా రైతులు

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాటికి ప్రచారం కల్పిస్తున్న 'మధుమాయా పాణిగ్రహి ఫౌండేషన్' కృషి అభినందనీయమని అతిథులు అన్నారు. మధుమాయా పాణిగ్రహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15వ 'కుమార పునేయి జొహ్నాలో..' ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాలికలకు రియా పుచ్చి, బొసా పుచ్చి, తొక్కుడు బిళ్ల, తాడాట, శంఖం ఊదడం వంటి గ్రామీణ క్రీడల్లో పోటీలు నిర్వహించింది. కళ్లికోట వర్సిటీ మైదానంలో నిర్వహించిన దీనికి నిర్వాహక ఫౌండేషన్ ముఖ్యుడు, అంతర్జాతీయ వ్యాఖ్యాత హృషికేష్ పాణిగ్రహి సమన్వయకర్తగా వ్యవహరించారు. గంజాం జిల్లా క్రీడాధికారి సంతోష్ కుమార్ సాహు అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి బాక్సింగ్ క్రీడాకారిణి మనోరమ మహరణాను అతిథులు, నిర్వాహకులు సత్కరించారు. వివిధ రకాల గ్రామీణ క్రీడా పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 325 మంది బాలికలు పాల్గొన్నారు. కుమార పునేయి జొహ్నాలో.. 2024 ఉత్సవ కమిటీ ప్రతినిధులు మిహిర్ కుమార్ త్రిపాఠి, త్రిపతి బాలాజీ పాత్, డి.సోమయ్య, సవ్యసాచి రథ్, సునీల్ పట్నాయక్, భవానీ శంకర్ మహాపాత్ర్, బిశ్వనాథ పాణిగ్రహి, భగవాన్ మహరణా తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


బాక్సింగ్ క్రీడాకారిణి మనోరమ మహరణాను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

దుర్గమ్మ సైకత యానిమేషన్

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బ్రహ్మపురకు చెందిన కళాకారుడు సత్యనారాయణ మహరణా ఆదివారం మహిషాసురమర్దిని అవతారాలను తొలిసారిగా రంగులో సైకత యానిమేషన్‌ను తీర్చిదిద్దారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



హిజ్రాలను గౌరవించాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని 7వ వార్డులోని కెవిటి వీధిలో నివాసముంటున్న గజపతి జిల్లా హిజ్రాల సంఘం కార్యదర్శి జాస్మిన్‌షేక్‌తో ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ వ్యక్తితో క్షమాపణలు చెప్పించారు.


ట్రాన్స్‌జెండర్ క్షమాపణలు అడుగుతున్న స్థానిక వాసి


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రికెట్ టోర్నమెంట్‌లో జయపురం జట్టు

జయపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున భువనేశ్వర్‌లో సోమవారం ప్రారంభం కానున్న అంతర్ జిల్లా స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జయపురం జట్టు సిద్ధమైంది. శనివారం రాత్రి క్రికెటర్లు మేనేజర్ వై.ప్రసాద్ నేతృత్వంలో భువనేశ్వర్ బయలుదేరారు. మేనేజర్ మాట్లాడుతూ సునాబెడ పాఠశాలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు, 8వ తేదీన డెంకనాల్‌తో పోటీ పడుతుందని తెలిపారు.

జిల్లాస్థాయిలో క్రీడాపోటీలు ప్రారంభం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా దాబుగాం క్రీడా మైదానంలో జిల్లాస్థాయిపోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగనుండగా, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ తదితర పోటీలు జరుగనున్నాయి. జిల్లా క్రీడా సంఘం అధ్యక్షుడు గోపాల్ ఆగర్వాల్ నేతృత్వంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా దాబుగాం శాసనసభ్యుడు మనోహర్ రంధారి, జిల్లా క్రీడాధికారి రేషమ్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు.


స్థానిక బస్టాండు వద్ద క్రీడాకారులు

సైక్లోథాన్‌లో స్వస్తిసింగ్‌కు రజతం


రజత పతకం, బహుమతితో స్వస్తిసింగ్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భారత సైక్లింగ్ సమాఖ్య (హెచ్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో చెన్నైలో ఆదివారం జరిగిన రెండో హెచ్‌సీఎల్ సైక్లోథాన్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సైక్లిస్ట్ స్వస్తి సింగ్ రజత పతకం దక్కించుకుంది. పోటీల్లో మహిళా ఎలైట్ విభాగంలో 55 కిలోమీటర్ల రోడ్డు మాస్ స్టార్ట్ అంశంలో ఆమె సైకిల్ తొక్కి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం, బహుమతి గెలుచుకుంది.

17 మంది విద్యార్థులపై చర్యలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం (భంజవిహార్) యంత్రాంగం ర్యాగింగ్ ఘటనకు సంబంధించి 17 మంది విద్యార్థులపై శనివారం రాత్రి చర్యలు తీసుకుంది. నలుగుర్ని వారం రోజుల్లోగా వసతి గృహం ఖాళీ చేయాలంది. మరో 13 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి వాటికి పాల్పడబోదని లికిత పూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. గత నెల 21న భంజవిహార్ పురుషుల వసతిగృహంలో మొదటి సంవత్సరం స్నాతకోత్తర(పీజీ) విద్యార్థులను రెండో సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్లు ఆరోపణలొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై వీసీ ఆచార్యిణి గీతాంజలిదాస్ ఉత్తర్వుల మేరకు పీజీ కౌన్సిల్ అధ్యక్షుడు ఆచార్య సుకాంత్‌కుమార్ త్రిపాఠి ఆధ్వర్యంలోని యాంటీ ర్యాగింగ్ సంఘం పరిస్థితి అధ్యయనం చేసింది. ఘటన వాస్తవమని నివేదిక సమర్పించిన తరువాత యంత్రాంగం ఈమేరకు చర్యలు తీసుకుంది. దీనిపై యూజీసీకి భంజవిహార్ అధికారులు తెలియజేశారు.

ఆధ్యాత్మికవేత్త కన్నుమూత

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పవర్‌హౌస్ కాలనీకి చెందిన ధర్మపారాయణరాలు పుష్పబతి మిశ్రా(85) ఆదివారం కన్నుమూశారు. అనారోగ్యంతో భువనేశ్వర్ క్యాపిటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు పూరీలో చేసేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. భగవద్గీత, భాగవతం, రామాయణం అధ్యయనం చేసి ప్రజలకు అర్థమయ్యేలా బోధించి అందరి మనస్సులు ఆమె గెలుచుకున్నారు.


పుష్పబతి మిశ్రా (పాతచిత్రం)

47 యూనిట్ల రక్తం సేకరణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: జిల్లా ప్రధానాసుపత్రి ప్రాంగణంలో గల రక్తనిధిలో ఆదివారం పట్టణానికి చెందిన వ్యాపారవేత్తల సంఘం(ఛాంబర్ ఆఫ్ కామర్స్) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీన్ని జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎం.ఎం.ఆలీ, అదనపు వైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌పండా ప్రారంభించారు. 47 యూనిట్ల రక్తం సేకరించినట్లు రక్తనిధి టెక్నీషియన్ ఖగేశ్వర్ బెహరా తెలిపారు. మల్ల శ్రీను, పొట్నూరు హరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సంఘం కార్యదర్శి జి.మోహనరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రక్తదానం చేయడం ద్వారా వేరొకరి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా విశ్రాంత ప్రజారోగ్య అధికారి వి.ఎల్.ఎన్.రాజు అన్నారు. స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం లేడీస్ వాకర్స్‌క్లబ్, యూత్ వాకర్స్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 24 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు జిల్లా రక్తనిధి కేంద్రం అధికారి గౌతమ్ పట్నాయక్ తెలిపారు.



మాట్లాడుతున్న రాజు, వేదికపై రజిత, గౌతం తదితరులు


రక్తదాత పక్కన సంఘం అధ్యక్షుడు పి.రామకృష్ణ, వైద్యులు ఎం.ఎం.ఆలీ, ప్రదీప్‌కుమార్ పండా తదితరులు

జిల్లా అభివృద్ధిపై అధ్యక్షుల చర్చ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ అభివృద్ధి కోసం పురాధ్యక్షులు సమావేశం జరిగింది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొట్పాడ్ పాలక సంస్థ అధ్యక్షుడు నరేంద్ర మహంతి, కొరాపుట్ పురపాలక సంస్థ అధ్యక్షుడు లాలెట్ రంజన్‌శెట్టి, సునాబెడ పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్‌పాత్రలు పాల్గొన్నారు. పురపాలక సంస్థల అభివృద్ధి, సమస్యలపై చర్చించుకున్నారు.

నేడు వినతుల స్వీకరణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

పదేళ్ల బాలుడి హత్య

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పదేళ్ల బాలుడు హత్యకు గురైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్పీ ధృతిమాన్ సర్కార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో కొత్తకోళికి చెందిన మనోజిత్‌సింగ్ (10) రెండు రోజుల నుంచి కనిపించడం లేదని దుండగులు అపహరించి రూ.5లక్షలు డిమాండు చేస్తున్నారని తల్లి దిజీయాదేవి పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు ప్రారంభించారు. బాధితుల ఇంటికి సమీపంలో శిథిలమైన రైల్వే క్వార్టర్ నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కిడ్నాపైన మనోజిత్‌సింగ్ మృతదేహాన్ని గుర్తించారు. 48 గంటల ముందు ఈ హత్య జరిగి ఉంటుదని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. మనోజిత్‌సింగ్ తండ్రి రాజుసింగ్ రైల్వే ఉద్యోగి. ఏడాది కిందట మృతిచెందడంతో కుమార్తె లీజాసింగ్‌కి ఉద్యోగం లభించింది. ఆమె ప్రియుడు సోనూకుమార్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు పోలీసులు అనుమానించి శనివారం రాత్రి సోనూసింగ్, లీజాసింగ్‌లను అరెస్టు చేశారు. హత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

కరడుగట్టిన నిందితుడి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పోలీసులు కరడు గట్టిన నిందితుడు బి.సంతోష్ పాత్ర్ అలియాస్ బుచ్చి పాత్ర్ (33)ను అరెస్టు చేశారు. ఆయనకు చోరీలు, దోపిడీలు, అక్రమ ఆయుధాలు సరఫరా, హత్యాయత్నం, గంజాయి అక్రమ రవాణా తదితర నేరాలతో ప్రమేయముందంటూ వివిధ పోలీసు స్టేషన్‌లలో 29 కేసులున్నాయని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మపుర పోలీసు జిల్లాలో గడిచిన రెండు రోజుల్లో ప్రత్యేక వారెంట్ డ్రైవ్‌లలో 15 మందిని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు. ★ గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలోని ఓ గ్రామంలోని కులపెద్దలు ఓ కుటుంబాన్ని బహిష్కరించగా, వారికి ఊరిలో కిరాణా దుకాణంలో సరకులు విక్రయించేందుకు యజమాని నిరాకరిస్తున్నారంటూ ఓ వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వచ్చింది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దొంగల అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ పరిధిలోని ఆలయాల్లోకి భక్తుల మాదిరిగా ప్రవేశించి దేవుళ్ల ఆభరణాలు దొంగతనం చేసి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీసీపీ పినాకి మిశ్ర ఆదివారం విలేకర్లకు చెప్పారు. వీరిద్దరి నుంచి నాగాభరణాలు, పళ్లెరాలు, గంటలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జూదంపై పోలీసుల దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలో బాసుదేవనగర్ మూడోలైనులోని ఇంట్లో సాగుతున్న జూదంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగుర్ని పట్టుకుని, వారి నుంచి రూ.2,18,340ల నగదు, ఆరు చరవాణులు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రవుర్కెలా ఉక్కు నగరంలోని ప్లాంట్ సైడ్ ఠాణా పోలీసులు ఆదివారం మధ్యాహ్నం లైసెన్స్ లేకుండా అక్రమంగా బాణసంచా విక్రయాలకు సిద్ధంగా ఉంచిన గిడ్డంగిపై దాడిచేశారు. రూ.20 లక్షల విలువచేసే సామగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు.


బాణసంచా గదిలో పోలీసుల సోదాలు

గ్యాస్ లీకై ఒకరి మృతి

● మరో ఇద్దరి పరిస్థితి విషమం ● ఇటుకల పరిశ్రమ ఆవరణలో ప్రమాదం



చెల్లాచెదురైన రేకులషెడ్




కేశవరావు (పాత చిత్రం)

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు జాతీయ రహదారిని అనుకొని ఉన్న ఫ్యూజన్ ఇటుకల పరిశ్రమకు చెందిన కార్మికుల నివాసంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్సై ఉపేంద్ర కథనం ప్రకారం.. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు నివాసం ఉండేందుకు 12 రేకుల షెడ్లు ఉన్నాయి. వీటిలో ఓ షెడ్‌లో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి చెందిన ఎం.లోక్‌నాథ్, అదే గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన జి.కృష్ణారెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగ గ్రామానికి చెందిన బి.కేశవరావు ఉంటున్నారు. విధులు పూర్తి చేసుకొని పక్కనే ఉన్న ఈ షెడ్‌లోకి ఈ కార్మికులు వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ లీకై షెడ్ అంతా వ్యాపించింది. వెంటనే తలుపులు తీసి వంట చేసుకోవడానికి ఉపక్రమించారు. గ్యాస్ పొయ్యి వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్‌పై రేకులు ఎగిరిపోయాయి. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి, ఇక్కడి నుంచి విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ఈ ముగ్గురికి కేజీహెచ్‌లో చికిత్స అందిస్తుండగా కేశవరావు ఆదివారం మృతి చెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సీఐ, ఎస్సై ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గ్యాస్ లీక్ కావడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రూ. కోటి పరిహారం ఇవ్వాలి... ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం రూ. కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ ఎలమంచిలి మండల కమిటీ కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. ఆయన విశాఖ కేజీహెచ్‌కి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంతో తీవ్ర జాప్యం జరగడం అన్యాయమన్నారు. అసలు యాజమాన్యం ఈ ప్రమాదాన్ని పెద్దగా పట్టించుకోలేదన్నారు. రాత్రి ఎవరికీ ఈ సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచారన్నారు. కేశవరావు కుమారుడు కంపెనీ యాజమాన్యానికి ఫోన్ చేస్తే మీ నాన్న బయటకు వెళ్లాడని చెప్పడం దారుణమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పాలకొండకు పండగ శోభ

● ప్రారంభమైన సామూహిక సంబరాలు



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోటదుర్గమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పట్టణం నలుమూలల నుంచి పలు కాలనీవాసులు సామూహిక సంబరాలు చేయడంతో పట్టణంలో పండగ శోభ నెలకొంది. నవోదయనగర్, గాయిత్రీనగర్, నక్కలపేట, షిర్డీసాయినగర్, వెంకంపేట, శెగిడివీధుల నుంచి వందల మంది మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. భక్తులకు కళింగ వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి భక్తులకు ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు దంపతులు, విజయనగరం జిల్లా ప్రత్యేక కోర్టు జడ్జి నాగమణి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



క్యూలైన్లలో భక్తుల రద్దీ



ఘటాలతో వెళ్తున్న నక్కలపేట షిర్డీసాయి కాలనీ మహిళలు

ఆన్‌లైన్‌లో ఆటలు... ప్రాణాలతో చెలగాటం

శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ ఆటలకు బానిసయ్యారు. భార్య, ఇద్దరు పిల్లలతో ఉన్నంతలో జీవితం సాఫీగా సాగిపోయేది. కాలక్షేపానికి మొదట రూ.10తో మొదలు పెట్టి రూ.లక్షల్లో నష్టపోయారు. స్నేహితులు, బంధువుల వద్ద రూ.కోటి వరకు అప్పులు చేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

సంతబొమ్మాళి మండలానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడి తెలిసిన వారి దగ్గర అప్పులు చేశారు. వారికి సమాధానం చెప్పలేక, ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబం పరిస్థితి చిన్నాభిన్నమైంది.

బోరుభద్ర ప్రాంతానికి చెందిన ఓ యువకుడు చరవాణిలో ఆన్‌లైన్ ఆటలకు బానిసయ్యారు. ఎక్కడా అప్పు దొరక్క పోవడంతో ఓ మహిళను గాయపరిచి మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. గ్రామంలో ఈ విషయం తెలిస్తే పరువు పోతుందని చివరకు రైలు కింద పడి తనువు చాలించారు.

మూలపేట పోర్టు నిర్వాసిత ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రభుత్వం యూత్ ప్యాకేజీ పథకంలో అందజేసిన రూ.10 లక్షలకు పైగా నగదును మూడు రోజుల్లో ఆన్‌లైన్ గేమ్‌ల్లో కోల్పోయారు. దీంతో ఒత్తిడికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించగా.. కుటుంబ సభ్యుల జాగ్రత్తతో ప్రాణాలతో బయటపడ్డారు. ఇవి కేవలం జిల్లాలో మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి



కేసులకు భయపడి..

ఆన్‌లైన్ ఆటల పుణ్యమా అని జిల్లాలో ఇలాంటి అఘాయిత్యాలు ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. డబ్బులు పోగొట్టుకున్న వారు కేసులకు భయపడి మిన్నకుండి పోతున్నారు. అప్పులు చేసి ఆడుతున్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మొదట రూ. 10తో మొదలుపెట్టి రూ. లక్షల్లో అప్పులు చేస్తున్నారు. పోగొట్టుకున్న సొమ్ము రాబట్టుకోవడానికి రూ. వేలు, రూ. లక్షలు పెడుతున్నారు

సులువుగా డబ్బు సంపాదించాలనే..

సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలా మంది ఆన్‌లైన్ ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. మొదట సరదాగా కాలక్షేపం కోసం మొదలుపెట్టిన వారు కూడా చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జిల్లాలో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా విద్యార్థులు, యువకులు, మధ్య తరగతి వ్యక్తులు వీటితో నష్టపోతున్నారు. కొందరు తొందరగా తేరుకుని దూరమవుతుంటే.. చాలా మంది బయట పడలేక ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు..

అత్యాశకు వెళ్లి మోసపోవద్దు

ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోసపూరిత ఆటలు ఉంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, యువత ఆలోచించాలి. అత్యాశకు వెళ్లి వాటికి బానిసలై ఆర్థికంగా నష్టపోవద్దు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. అలవాటు పడిన వారి గురించి సమాచారం ఇస్తే కౌన్సిలింగ్ ఇస్తాం. విద్యా సంస్థల్లో వీటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– అంబటి విజయ్‌కుమార్, సీఐ, టెక్కలి

ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా..

అంతర్జాలంలో ఇటువంటి ఆటలు చాలా ఉన్నాయి. తొలుత పెట్టిన డబ్బులకు రెట్టింపు వచ్చేలా చేస్తారు. రెండు, మూడు సార్లు ఇలా జరుగుతుంది. ఆ తర్వాత అసలు దందా మొదలవుతుంది. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా చరవాణితో ఆట సాగుతుంది. గెలిచిన మొత్తంలో 15 శాతం వరకు కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీ తీసుకుంటుంది.

తప్పుడు లొకేషన్ చూపిస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం వీటిలో కొన్నింటిని నిషేధించింది. అనుమతులున్న రాష్ట్రాల్లో ఉన్నట్లుగా లొకేషన్ చూపిస్తూ అక్రమంగా ఆట మొదలు పెడుతున్నారు. కొన్ని ఆటలకు పాన్‌కార్డు నంబరు, బ్యాంకు ఖాతా, మెయిల్ ఐడీ వంటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పాతపట్నంలో ఇసుకాట..!

● కప్పం కడితేనే లారీలకు దారి
● ఒడిశా అనుమతులున్నా అడ్డుకుంటున్న అక్రమార్కులు



గత నెల 22న సరుబుజ్జిలి పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని, ఉచిత ఇసుకను వినియోగదారులకు చేరువచేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుంటే పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కొద్దిరోజులుగా యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. ఒడిశా నుంచి అనుమతులతో విశాఖకు వెళ్తున్న లారీలనూ కొందరు అడ్డుకుంటున్నారు. తమ ప్రాంతం మీదుగా వెళ్లాలంటే కప్పం కట్టాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమ నాయకుడు అడ్డుకోమన్నట్లుగా చెబుతున్నారని లారీ డ్రైవర్లు వాపోతున్నారు.

ఒడిశాలోని గుణుపురం వద్ద ఆ ప్రభుత్వ అనుమతితో కొన్ని ఇసుక రేవులు నడుస్తున్నాయి. అక్కడి నుంచి బుక్ చేసుకున్న కొన్ని లారీలు కొత్తూరు మీదుగా జాతీయ రహదారికి చేరుకొని విశాఖకు వెళ్తున్నాయి. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. రెండు వారాల కిందట పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్యనేత అనుచరులమని చెప్పి కొందరు గుణుపురం సమీపంలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడి లారీలు తమ నియోజకవర్గం మీదుగా రావాలంటే తమ నాయకుడిని కలవాలని, లేదంటే వాహనాలను అడ్డుకుంటామని చెప్పగా.. ర్యాంపు దక్కించుకున్న గుత్తేదారులు అందుకు ఒప్పుకోలేదని తెలిసింది.

అడ్డుకోవడం వెనుక ఆంతర్యమేంటో!

వారం కిందట కొత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఏడు లారీలను మెట్టూరు కూడలి వద్ద తెదేపా నేతలు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఇవి అక్రమమా లేదా సక్రమమా అని తేల్చడంలో జాప్యం జరిగింది. మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ్డ వద్ద అధికారికంగా నడుస్తున్న రేవు నుంచి విశాఖకు చెందిన వ్యక్తి బుక్ చేసుకున్నారు. లారీ కొత్తూరు వద్దకు రాగానే కొందరు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తే మళ్లీ ఆ నాయకుడి పేరు చెప్పారు. చివరికి అన్ని అనుమతులు ఉండటంతో వాహనాలను విడిచిపెట్టారు. ● సరుబుజ్జిలిలో కూడా పాతపట్నం నేతల ఆదేశాలతో గత నెల 22న మూడు లారీలను పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. రెండు రోజుల తర్వాత వీటిని విడిచిపెట్టారు. అసలు ఎందుకు లారీలను పట్టుకుంటున్నారు? పోలీసులకు అప్పగిస్తున్నారు? విడిచిపెడుతున్నారు? ఎందుకు కేసు నమోదు చేయట్లేదనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

వయా కొత్తూరు..

పాలకొండ నియోజకవర్గ పరిధి భామిని మండలంలో కొన్నిచోట్ల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి లారీలు కొత్తూరు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఈ తంతు వెనుక పాతపట్నానికి చెందిన మరో ముఖ్యనేత కుమారుడు ఉన్నట్లు సమాచారం. వీళ్లు మన్యం జిల్లాలో పలు ప్రాంతాల్లో అనధికారికంగా ఇసుక తీసుకువచ్చి రహదారిపైకి వచ్చే సరికి ఒడిశా బిల్లులు చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల మాట ఇదీ..

కొత్తూరు పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుకున్న లారీలపై కేసు నమోదు చేయలేదని వాహనాలు స్టేషన్ వద్దనే ఉన్నాయని సీఐ ప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై జిల్లా భూగర్భ గనులశాఖాధికారి సి. మోహన్‌రావును వివరణ కోరగా లారీలు పట్టుబడిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. సరుబుజ్జిలి స్టేషన్ పరిధిలో పట్టుకున్నవాటికి జరిమానా విధించామని తెలిపారు.

సంపూర్ణ విజయానికి.. సంకల్పమే రహస్యం..!

చిన్న వయసులోనే కన్నోళ్ల కష్టాన్ని గుర్తించాడు. పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబానికి చేదోడుగా నిలవాలనుకున్నాడు. ఆ యువకుడి సంకల్పాన్ని చూసి విధికి కన్ను కుట్టిందేమో.. ఊహించని ప్రమాదంలో రెండు కాళ్లు పోయేలా చేసింది. అయితేనేం కుంగిపోకుండా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాడు. బ్యాడ్మింటన్ క్రీడలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణారావు. ఇటీవల జరిగిన ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం సాధించి అందరితో మరోసారి శభాష్ అనిపించుకున్నాడు.

సాధించిన ఘనతలు..

- ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్-2024లో కాంస్య పతకం
- ఈ ఏడాది ఉగాండాలో జరిగిన పోటీల్లో మూడు పతకాలు
- గతేడాది థాయిలాండ్ వేదికగా నిర్వహించిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్‌లో రెండు కాంస్యాలు
- 2023లో ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం, మెన్స్ డబుల్స్‌లో కాంస్య పతకం

● అంతర్జాతీయ వేదికపై మెరిసిన జిల్లా క్రీడాకారుడు
● ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం



న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

పూర్ణారావు తల్లిదండ్రులు లక్ష్మణరావు, మోహిని ఊళ్లో చిన్న కిళ్లీ బడ్డీ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. పేదరికం నుంచి కుటుంబాన్ని బయటకు తీసుకురావాలని ఈ యువకుడు ఇంటర్ పూర్తికాగానే 2015లో ఉద్యోగం నిమిత్తం సింగపూర్ వెళ్లాడు. 2017లో సెలవుపై స్వగ్రామానికి వచ్చినప్పుడు 21 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెన్నుపూస పూర్తిగా దెబ్బతిని.. మూడేళ్లు మంచానికే పరిమితమయ్యాడు. బెంగళూరులోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న సమయంలో వీల్ ఛైర్ బ్యాడ్మింటన్‌పై మక్కువ పెంచుకున్నాడు. యూట్యూబ్‌లో చూసి ఆటలో మెలకువలు తెలుసుకున్నాడు. ఆర్థిక దన్ను కోసం ఓ ఫుడ్ డెలివరీ సంస్థలో బాయ్‌గా పని చేస్తూనే సాధన చేసేవాడు. అలా రాకెట్ ఝుళిపిస్తూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. ప్రస్తుతం జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్‌లో 3వ స్థానంలో కొనసాగుతున్నాడు.

పారాలింపిక్స్‌లో పతకమే లక్ష్యం..

నా ప్రతిభను గుర్తించి కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు డ్రీమ్ లెవెన్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ఇండోనేషియా పర్యటనకు రూ. 1.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. వాటితోనే వెళ్లి టోర్నీలో విజయం సాధించాను. దాతలు సహకరిస్తే దేశం తరపున పారాలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కృషి చేస్తాను



- చాపర పూర్ణారావు, అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు



రథాన్ని లాగుతున్న మహిళా భక్తులు

అమ్మవారి రథోత్సవం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు శ్రీ పంచముఖేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితాదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఇలా గుడి చుట్టూ ఊరేగింపు చేపడతారు.



ఆత్మీయ కలయిక

కొమరాడ మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2003లో ఇక్కడ చదివిన వారంతా 21 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు.

– న్యూస్‌టుడే, కొమరాడ

దారంతా పొదలే..



మందస మండలం ఉగ్రవానిపేట నుంచి సరియాపల్లి వెళ్లే రహదారి ఇది. పొదలతో ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. దట్టంగా అల్లుకున్న పొదలు ఎలుగుబంట్లకు ఆవాసాలుగా మారాయని, చీకటి పడితే ఆ దారిలో రాకపోకలు చేయడం భయంగా ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని రహదారిల్లో పొదలు తొలగిస్తామని సర్పంచి బి.వెంకటరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

చెత్తతో ఇక్కట్లు

కంచిలి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి పక్కన రోజుల తరబడి చెత్త పేరుకుపోతుండటంతో అక్కడ పందులు, కుక్కలు చేరి పరిసరాలను మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కార్యాలయాలకు రాకపోకలు సాగించేవారంతా దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రాంబాబు వివరణ కోరగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో చర్చించి చర్యలు తీసుకొంటామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి



కషాయాలతో పంటలకు మేలు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గ్రామంలో దొరికే వివిధ రకాల ఆకులతో కషాయాలు తయారు చేసి పంటలకు వేస్తే మేలైన దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి భూషణరావు తెలిపారు. ఎల్విన్‌పేట పంచాయతీలోని జేకేపాడులో ఆదివారం అవగాహన కల్పించారు. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, జిల్లేడు ద్రావణం తయారీ, వాటి వినియోగం, మెలకువల గురించి సమగ్రంగా వివరించారు.

ప్రమాదకరంగా నేలబావి

కవిటి మండలం నెలవంక పంచాయతీ బైరెడ్లపుట్టుగలో రోడ్డు పక్కనే నేలబావి(నుయ్యి) ప్రమాదకరంగా ఉంది. గత పదేళ్లుగా ఆ బావిని గ్రామస్థులు వినియోగించకపోవడంతో వృథాగా ఉంది. ఆ నుయ్యి తక్కువ ఎత్తులో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఈ విషయంపై వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



మురుగుతో దుర్వాసన



ఇచ్ఛాపురం పట్టణం కార్జీవీధి మండపం సమీపంలోనే బోరవీధి వద్ద మురుగు కాలువ సమస్య తీవ్రంగా ఉంది. కాలువ శిథిలావస్థకు చేరిన పురపాలకులు పట్టించుకోవడం లేదని, వర్షం పడితే రోడ్డంతా మురుగు నీరు చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తూ, కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మలుపులో ముప్పు..

కంచిలి మండలంలోని సాలిన పుట్టుగ గ్రామం చివర శుద్ధజల ప్లాంటు మలుపు వద్ద రహదారిపై గుంత ఏర్పడటంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అది పెద్దదిగా మారడంతో గుంతను తప్పించే క్రమంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ మోహనరావు స్పందిస్తూ.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



బాలికపై వృద్ధుడు అత్యాచారం

భామిని, న్యూస్‌టుడే: తొమ్మిదేళ్ల చిన్నారిపై ఓ వృద్ధ కామాంధుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బత్తిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భామిని మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(9) తల్లిదండ్రులు కూలి పనులు నిమిత్తం విశాఖపట్నంకు వెళ్లడంతో నాన్నమ్మతో కలిసి ఉంటోంది. అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నారావు(69) కూడా కూలి పనులు కోసం రాజమహేంద్రవరం వలస వెళ్లాడు. వృద్ధాప్య పింఛను కోసం నెలవారీగా ఇక్కడికి వస్తుంటాడు. ఈక్రమంలో చిన్నారిపై కన్నేసిన వృద్ధుడు ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై డి.అనీల్ కుమార్‌తో సహా సిబ్బంది గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించి, వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.